
సాక్షి ఒడిశా

మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5.75.306లు, బంగారం 300 మిల్లీగ్రాములు, వెండి 85గ్రాములు 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పీడీఎస్ లబ్ధిదారులకు ఆర్థిక సాయం

ప్రభుత్వ ఆహార భద్రత కార్యక్రమం కింద ప్రతీ లబ్ధిదారుల కుటుంబానికి రూ.1,000 ఆర్థిక సాయంగా చెల్లించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి సోమవారం ఆమోదం తెలిపింది.

- 8లో



విద్యుత్ షాక్‌తో లైన్‌మేన్ మృతి

రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితి నర్గిగుడ గ్రామానికి చెందిన జ్యోతిరాం మాఝి (29) అనే లైన్‌మెన్ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు

- 8లో

న్యూస్‌రీల్

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



మొగలిపూల రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్ కుమార్ పండా తదితరులు

బరంపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గంజాం జిల్లాలో బీజేడీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ కుమార్ పండా కోరారు. స్థానిక గోపాల్‌పూర్ నియోజకవర్గం రోంగయిలొండా బ్లాక్ డొంకలపాడు సమితిలోని మొగలిపూల రైతులతో జిల్లా బీజేడీ నాయకుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంచాయతీ స్థాయిల్లో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యలు తెలుసుకొని, పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. బ్లాక్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పథకాలను వివరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి వివిధ పార్టీ హోదాల్లో ఉన్న బీజేడీ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో అగ్నిప్రమాదం



కాలి బూడిదైన ప్లాస్టిక్ సామగ్రి

పర్లాకిమిడి: స్థానిక పురపాలక సంఘం కార్యాలయం స్టోర్ రూమ్‌లో ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఫైల్స్, ఇతర రశీదు పుస్తకాలు కాలి బూడిదయ్యాయి. గోడౌన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి తెలియజేశారు. ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా దుకాణాల్లో పట్టుబడిన ప్లాస్టిక్ సంచులు స్టోర్ రూమ్‌లో నిల్వ చేశారు.

గంజాయితో ఐదుగురు అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను మునిగుడ పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. వారి నుంచి 28.400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఐఐసీ సొదామిని బెహర తెలియజేశారు. ఎప్పటిలాగే పోలీసులు బస్టాండ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఆరు బస్తాలను పట్టుకొని ఉన్నటువంటి ఐదుగురు వ్యక్తులను అనుమానిస్తూ తనిఖీలు నిర్వహించారు. దీంతో వారి వద్ద గంజాయి పట్టుబడింది. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు సోమవారం తరలించారు. అరెస్టైనవారిలో మధ్యప్రదేశ్‌కు చెందిన రాజేష్ సింగ్, పుష్పేంద్ర సింగ్, కేరళకు చెందిన ఎం.రంజిత్, అలిబామ్ సాజి, మహ్మద్ షేక్‌లు ఉన్నట్లు తెలియజేశారు.

లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి కుమార్ధాముని వద్దనున్న కెడి కాలనీ సమీపంలో ఆదివారం సాయంత్రం మునిగుడ నుంచి ఆంధ్రకు వెళ్తున్న ఒక లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీ హెల్పర్ మృతి చెందగా, డ్రైవర్ గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రుడిని అక్కడివారు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

రాష్ట్రంలో ... రాజకీయ వేడి



- గెలుపు కోసం ప్రతిపక్షాల వ్యూహాలు
- అగ్రనాయకులతో ప్రచారాలకు సన్నాహాలు
- నేడు రాష్ట్రంలో పర్యటించనున్న శివరాజ్ సింగ్ చౌహాన్

భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. ఈ ఎన్నికల్లో బల ప్రదర్శనకు 2 ప్రధాన విపక్షాలు కాంగ్రెసు, భారతీయ జనతా పార్టీలు ఉవిళ్లూరుతున్నాయి. పార్టీ ప్రముఖులతో ప్రచారం చేయించి ఓటరుని ఆకట్టుకునే తొలి ప్రయత్నంలో ఈ రెండు పార్టీలు అగ్ర శ్రేణి నాయకులను ఆహ్వానించి ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాయి. మంగళవారం నుంచి ఈ హడావుడి ఆరంభం అవుతుంది. రాష్ట్ర పర్యటనకు భారతీయ జనతా పార్టీ పలువురు కేంద్ర నాయకులను వరుసలో ఉంచగా, కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్లు ప్రియాంక గాంధీ, సచిన్ పైలట్‌ని రాష్ట్ర పర్యటనకు ఆహ్వానించింది.

కార్యకర్తల్లో మనోధైర్యం

రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్ర పార్టీ కార్యకర్తల మనోధైర్యాన్ని బలోపేతం చేసిందని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) శరత్ పట్నాయక్ తెలిపారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడానికి రాష్ట్ర కాంగ్రెస్ సిద్ధమవుతోందన్నారు. సచిన్ పైలట్, ప్రియాంకలు రాష్ట్ర నేతల ప్రచారం కోసం ఒడిశా వస్తారని వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా పలుచోట్ల పార్టీ కార్యక్రమాలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ ఇరువురు నేతల రాష్ట్ర పర్యటన తేదీలు ఇంకా ఖరారు అవ్వలేదన్నారు. వీరి పర్యటన రాష్ట్ర నాయకులను, కార్యకర్తలను మరింతగా ఉత్సాహపరుస్తుందన్నారు.

బీజేపీ నాయకుల ఆగమనం

భారతీయ జనతా పార్టీ ఎన్నికల ప్రచారానికి అగ్ర శ్రేణి నాయకులు రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నట్లు రాష్ట్ర శాఖ వర్గాల సమాచారం. 4 మంది సీనియర్ నేతలు శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్రమంత్రులు నితిన్ గడ్కారీ, రాజ్‌నాథ్ సింగ్‌లతో పాటు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా ఈ జాబితాలో చోటు చేసుకోవడం విశేషం. వీరంతా పార్టీ సభ్యుల కోసం సమావేశాలు, బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతుంది. కార్యకర్తలను ఉత్తేజపరచి రాష్ట్రంలో అధికార పక్షం బిజూ జనతా దళ్‌ని గద్దె దించే యోచనతో బీజేపీ రాష్ట్ర శాఖ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. దీనిలో భాగంగా ప్రచారం బలమైన అస్త్రంగా పరిగణిస్తోంది. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశ పురోగతిలో భాగంగా రాష్ట్ర అభివృద్ధి మేళవింపుని సామాన్య ఓటరుకు సవివరంగా తెలియజేసే ప్రయత్నంలో తలమునకలై ఉంది.

విజయమే లక్ష్యం లక్ష్యంగా...

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 51 శాతం ఓట్లను సాధించాలని బీజేపీ రాష్ట్ర శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా ఈనెల ప్రారంభంలో సంబల్‌పూర్‌లో పార్టీ భారీ కార్యక్రమంతో ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికలకు సమాయత్తం చేసిన విషయం తెలిసిందే.

నేటి నుంచి నాయకుల ప్రచారం

భారతీయ జనతా పార్టీ నాయకుడు శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం ఒడిశాకు చేరుకుంటారని రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ తెలిపారు. కటక్ మరియు జగత్‌సింగ్‌పూర్ పార్లమెంటరీ నియోజకవర్గాల్లో నిర్వహించనున్న సమావేశాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర శాఖ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అదేవిధంగా ఈనెల 15న కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ ప్రచారానికి రాష్ట్రానికి వస్తున్నారని తెలిపారు. పూరీ శ్రీజగన్నాథ ఆలయంలో పూజాదుల్లో ఆయన పాల్గొంటారు. అనంతరం పూరీ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పాట్లను సమీక్షిస్తారని తెలిపారు. ఆయన తర్వాత ఈనెల 22న కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాష్ట్రానికి విచ్చేస్తారు. అయితే ఇంతవరకు ఆయన పర్యటన కార్యక్రమాలు ఖరారు కాలేదన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా ఈ నెలాఖరులోగా రాష్ట్రం పర్యటించవచ్చని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ ఎన్నికల వ్యవహారాల ఇన్‌చార్జి విజయ్‌పాల్ సింగ్ తోమర్, కో–ఇన్‌చార్జి లతా ఉసెండి నగరంలో డేరా వేసి రాష్ట్ర యూనిట్ సీనియర్ పార్టీ నాయకులతో రాబోయే ఎన్నికల వ్యూహాన్ని ఖరారు చేయడానికి మేధోమథనం నిర్వహిస్తున్నారు.

అట్టడుగు స్థాయి నుంచి బలోపేతం

ఈ ఎన్నికల్లో ధీటైన పోటీనివ్వడం తథ్యం. లక్ష్యం మేరకు విజయం సాధించేందుకు అట్టడుగు స్థాయి నుంచి బలోపేతం చేయనున్నట్లు బీజేపీ సీనియర్ నాయకుడు జయనారాయణ మిశ్రా తెలిపారు. ఎన్నికలకు ముందు రాష్ట్రంలో 21 లోక్‌సభ స్థానాల్లో పార్టీకి చెందిన 21 మంది జాతీయ నాయకులు ప్రచారం చేస్తారని వివరించారు. బూత్ స్థాయిలో పార్టీ పునాదిని పటిష్టం చేయడంపై రాష్ట్ర శాఖ దృష్టి సారిస్తోందన్నారు. అధికార బీజేడీని ఓడించేందుకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక వ్యూహాలు రచిస్తున్నామని తెలిపారు.

సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు



సమావేశంలో పాల్గొన్న ఆశ వర్కర్లు

పర్లాకిమిడి: ఈనెల 16న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) మద్దతునిస్తుందని రాష్ట్ర ఏఐటీయూసీ సాధారణ కార్యదర్శి బిజయ జెన్నా తెలియజేశారు. స్థానిక కొత్త బస్టాండ్ వద్ద సోమవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి జొన్న సుభాష్ చంద్రరావు, ఆశ వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి నమితా సాహు, డ్రైవర్స్ మహాసంఘం అధ్యక్షుడు జ్యోతిపాల్, జిల్లా నాయకులు రంజన్ మహాపాత్రో, నర్సింగ మాలబి సాయి, ఇషా మరియు మాళి తదితరులు హాజరయ్యారు. శ్రామిక, కర్మచారికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త ఆందోళన, ఒకరోజు సమ్మెకు పిలుపు ఇచ్చామని బిజయ జెన్నా అన్నారు. సమ్మెలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొంటారని సీపీఐ నాయకుడు జోన్న సుభాష్ చంద్రరావు వెల్లడించారు.



మాట్లాడుతున్న సుభాష్ చంద్రరావు

రాయగడలో వరుస దొంగతనాలు



చోరీ జరిగిన సాయి మందిరం



పాత ఎల్ఐసీ కాలనీలోని మహంతి ఇల్లు

రాయగడ: పట్టణంలో వరుస దొంగతనాలు చోటుచేసుకుంటుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్థానిక న్యూకాలనీలోని సత్యసాయి మందిరంలో దుండగులు చోరీ చేశారు. గేటు తాళం విరగ్గొట్టి సుమారు 3 కిలోల వెండి తోరణ ఆభరణాలను దొంగిలించారు. దీనిపై మందిరం కన్వీనర్ శివకుమార్ అగ్రవాల్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆదివారం అర్ధరాత్రి ఈ దొంగతనం జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి న్యూకాలనీ ప్రాంతంలో ఉన్న సీసీ కెమేరాలను ఐఐసీ నిహారి రంజన్ కుహరో పరిశీలిస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు మందిరం తాళం విరగ్గొట్టి లోపలకు ప్రవేశించినట్లు గుర్తించారు. ఇదిలా ఉండగా స్థానిక పాత ఎల్ఐసీ కాలనీలో నివసిస్తున్న సునీల్ కుమార్ మహంతి ఇంట్లో కూడా దొంగతనం జరిగింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాలలో పీఈటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మహంతి జనవరి 28వ తేదీన క్రీడా పోటీల కోసం భువనేశ్వర్ వెళ్లారు. ఆయా పనులు పూర్తి చేసుకుని ఆదివారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోని అల్మారాలో ఉన్నటువంటి రూ.50 వేల నగదు, సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, ట్యాబ్‌లు దొంగిలించబడ్డాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఐక్య పోరాటంతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న శశిభూషణ దాస్

జయపురం: ఐక్య పోరాటంతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని ఒడిశా అమల సంఘ అధ్యక్షుడు, నాన్ గెజిటెడ్ వర్కర్స్ సమన్వయ సమితి ఆర్గనైజర్ శశిభూషణ దాస్ అన్నారు. స్థానిక సాంత్ర సాహి కల్యాణ మండపంలో నాన్ గెజిటెడ్ వర్కర్స్ సమన్వయ సమితి కొరాపుట్ జిల్లా విభాగ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు అందజేయడంతో నాన్ గెజిటెడ్ ఉద్యోగుల పాత్ర కీలమని, అందువలన తమ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం సరికాదన్నారు. అలాగే పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని, నూతన వేతన కమిషన్ ఆధారంగా ఇంటి అద్దె, బీమా సురక్షా అమలు చేయాలని కోరారు. కోవిడ్ సమయంలో నిలిపి వేసిన డీఏను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వినతి పత్రం సమర్పించాలని సమావేశంలో తీర్మానించారు. ఈనెల 25వ తేదీన బరంపురంలో రాష్ట్ర నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సమన్వయ సమితి ద్వారా జరుగనున్న సమావేశంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని నేతలు విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా మార్చి 3వ తేదీన జిల్లాలో ఒక సమావేశం ఏర్పాటు జరుగుతుందని, ఆ సమావేశంలో జిల్లా నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సమన్వయ సమితి కార్యవర్గ ఎన్నికలు జరుగుతాయని ప్రకటించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా అమల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞాన రంజన్‌దాస్, గౌరవ అతిథిగా ఒడిశా అమల సంఘ కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు సునాకర రౌత్, ప్రభుత్వ విశ్రాంత అధికారి కమలా కాంత రథ్, చతుర్థ శ్రేణి ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సూర్యమణి మఝి, అనిల్ కుమార్ దేవత, ఒడిశా అమల సంఘం మల్కన్‌గిరి జిల్లా శాఖ అధ్యక్షుడు శ్యామ సుందర నాయిక్, నవరంగపూర్ జిల్లా శాఖ అధ్యక్షుడు సిద్దేశ్వరి బెనియ, యజ్ఞేశ్వర పండ, సురేష్ కుమార్ పండ, బాజీ సెట్టి, సంజయ కుమార్ పండ, అశోక్ కుమార్ మిశ్ర తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన శిబిరం



మాట్లాడుతున్న బలరామ్ నాయక్

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి కేంద్రంలో ఉన్నటువంటి ఎకో పార్క్‌లో పర్యావరణంపై అవగాహన శిబిరం సోమవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని చిత్రకొండ అటవీ శాఖ రేంజర్ బలరామ్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలలో ఉన్నటువంటి ఔషధ గుణాలను తెలియజేశారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి కాలేజీ విద్యార్థులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కలప దుంగలు స్వాధీనం



అటవీ అధికారులు సీజ్ చేసిన కలప దుంగలు



పోలీసులు సీజ్ చేసిన వ్యాన్

బరంపురం: మొక్కలు నాటి పచ్చదనం పరిరక్షించాలని ఒకవైపు రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవాలు జరుపుకుంటుండగా, మరోవైపు గంజాం జిల్లాలో పచ్చని చెట్లను నరికివేస్తున్న కలప మాఫియా ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. ఐఐసీ అభిమన్య నాయక్ తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం నగర శివారు గొళంతరా పోలీసుస్టేషన్ పరిధిలో టమనా జంగిల్ నుంచి వ్యాన్‌లో అక్రమంగా కలపను తరలిస్తున్న సమయంలో అటవీ అధికారులు దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా రూ.లక్షలు విలువ చేసే కలప దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అయితే అటవీ అధికారులు ఎవరినీ అరెస్టు చేయకపోవడంపై ప్రజల్లో పలు అనుమానాలు రేగుతున్నాయి.

శిల్టగుడ డ్యామ్‌లో యువకుడు గల్లంతు



డ్యామ్‌లో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఇన్‌సెట్లో) చైతన్య కుమార్ (ఫైల్)



రాయగడ: సదరు సమితి వీరనారాయణపూర్ సమీపంలోని శిల్టిగుడ డ్యామ్‌లో ఒక యువకుడు గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక సాయిప్రియ నగర్‌లో నివాసముంటున్న చైతన్య కుమార్ (19) అనే యువకుడు ఆదివారం స్నేహితులతో కలిసి పిక్నిక్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో సాయంత్రం ఇంటికి వస్తున్న సమయంలో డ్యామ్‌లో స్నానానికి దిగడంతో నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన అతని స్నేహితులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది సోమవారం వెతకడం ప్రారంభించారు. డ్యామ్‌లో సుమారు పది అడుగుల లోతు వరకు నీరు ఉండడంతో గాలింపు చర్యలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అగ్నిమాపక సిబ్బంది తెలియజేశారు. సంఘటన స్థలానికి తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఓడ్రాఫ్ దళంను రప్పించి గాలింపు చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలియజేశారు.

• రాజమాతకు తుది వీడ్కోలు



రాజమాత భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం



గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు



చివరి చూపుకు హాజరైన ప్రజలు, నాయకులు

కల్లికోట్ రాజమాత, మాజీ ఎమ్మెల్యే రాణి సుజ్ఞాన కుమార్ దేవి భౌతిక కాయానికి రాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో సోమవారం తుది వీడ్కోలు పలికారు. ఆశేష ప్రజానికం రాజమాతకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రి విక్రమ్ కేసరి, బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు తదితరులు పాల్గొన్నారు. బరంపురం

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్ మృతి



విద్యుత్ స్తంభంపై జ్యోతిరాం మృతదేహం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి సర్గిగుడ గ్రామానికి చెందిన జ్యోతిరాం మాఝి (29) అనే లైన్‌మెన్ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. జ్యోతిరాం కరెంట్ స్తంభం ఎక్కి మరమ్మతులు నిర్వహిస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడి కుటుంబానికి విద్యుత్ శాఖ నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్రమశిక్షణ కలిగిన '1104 సంఘం'



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ లక్ష్మణరావు

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ సంస్థలో 1104 సంఘం క్రమశిక్షణ కలిగిన సంఘమని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు తెలిపారు. స్థానిక దాసన్నపేటలోని సంఘ కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) 74 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్మికుల పక్షాన, సంస్థ పరిరక్షణ కోసం, ఉద్యోగాల హక్కుల కోసం సంఘం చేస్తున్న పోరాటాలను అభినందించారు. ఈఈ పూడి హరి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పనిచేసే ఉద్యోగులు సేఫ్టీ పరికరాలు ఉపయోగించి విధులు నిర్వర్తిస్తే ప్రమాదాలు జరగవన్నారు. రూరల్ డివిజన్ ఈఈ సురేష్ మాట్లాడుతూ ఉద్యోగులు హక్కులు కోసం నినదించే ముందు బాధ్యతలు కూడా గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి సురగాల లక్ష్మణ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగరాజు, కె.అప్పారావు, బి.దేముడు, ఎన్.పైడిరాజు, ఎన్.రమణ, ఎ.జి.మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

15న విజ్ఞాన ప్రదర్శన

- డీఈఓ ఎన్.ప్రేమకుమార్

విజయనగరం అర్బన్: విద్యార్థులను భావి శాస్త్ర వేత్తలుగా తీర్చిదిద్దేందు కు, శాస్త్రవిజ్ఞానంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 15న ఇన్‌స్పైర్ సైన్స్ ప్రాజెక్టు ల ప్రదర్శన నిర్వహిస్తామని డీఈఓ ఎన్.ప్రేమకుమార్ సోమవారం తెలిపారు. విజయనగరం పట్టణంలోని శ్రీచలపతి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల విద్యార్థులు 2022-23 సంవత్సరంలో మంజూరు చేసిన ప్రాజెక్టులను జిల్లా స్థాయి ప్రదర్శన పోటీలకు తీసుకురావాలన్నారు. ఒక్కో ప్రాజెక్టు ప్రదర్శనకు ఒక విద్యార్థి ఒక గైడ్ హాజరుకావాలన్నారు. ఉమ్మడి విజయనగరం వేదికగా జరిగే పోటీల్లో మొత్తం 180 ప్రాజెక్టులు ప్రదర్శిస్తామని తెలిపారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మరియు ఎస్సీఈఆర్టీ, పాఠశాల విద్య ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయని జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ ఎం.కృష్ణారావు తెలిపారు.

గొలుసు దొంగకు ఆరుమాసాల జైలు

జామి: గొలుసు దొంగతనం చేసిన ముద్దాయికి 6మాసాల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ ఎస్.కోట జేఎఫ్‌సీఎం తీర్పు వెలువరించింది. ఈ కేసుపై జామి ఎస్సై వీరబాబు అందించిన వివరాల ప్రకారం గత ఏడాది నవంబర్ 3వ తేదీన లొట్లపల్లి జెడ్పీఉన్నత పాఠశాలకు చెందిన హెచ్‌ఎం అరుణకుమారి బైక్‌పై పాఠశాలకు వస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలో బంగారం గొలుసు తెంచి పరారయ్యాడు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి విశాఖపట్నంలోని కంచరపాలెం ప్రాంతానికి చెందిన భీమరశెట్టి కమలనాథ్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేసి చోరీ జరిగిన బంగారం గొలుసు రికవరీ చేశారు.నిందితుడిని కోర్టులో హాజరుపరచగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసవరావు వాదనలు వినిపించారు. వాదనల అనంతరం ముద్దాయిని నిర్ధారించి న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

హత్య కేసులో జీవిత ఖైదు

సాలూరు రూరల్: మండలంలోని తోణాం పంచాయతీ బెంగుదువలస గ్రామానికి చెందిన చోడిపల్లి రాజయ్యకు పార్వతీపురం అడిషనల్ కోర్టు మెజిస్ట్రేట్ జీవిత ఖైదు శిక్ష విధించారు. ఈ మేరకు స్థానిక ఎస్సై ఎం.వెంకటరమణ సోమవారం తెలిపారు. 2016 సెప్టెంబర్ 16న చోటిపల్లి సీతమ్మకు చిల్లంగి ఉందన్న నెపంతో అదే గ్రామానికి చెందిన రాజయ్య నాటు తుపాకీతో ఆమెను కాల్చి చంపాడు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కేసు నమోదు చేశారు. మెజిస్ట్రేట్ కోర్టులో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో హత్య చేసిన ముద్దాయికి కోర్టు జీవిత ఖైదు శిక్ష ఖరారు చేసింది.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం



108 రకాల ప్రసాదాలతో అమ్మవారికి నైవేద్యం

స్థానిక కస్పావీధి మెయిన్ రోడ్డులోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆర్య వైశ్యసంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, వాసవీ లేడీస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉత్సవాల్లో అమ్మవారికి పంచామృత అభిషేకాలు జరిగాయి. అనంతరం సామూహిక కుంకుమార్చనలు, దీపారాధన కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాల్లో తెలుగు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక వ్రత పూజలు జరిపారు.

–బరంపురం

పీడీఎస్ లబ్ధిదారులకు ఆర్థిక సాయం

- 26 ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం
- వివరాలు వెల్లడించిన మంత్రి రణేంద్రప్రతాప్



వివరాలు తెలియజేస్తున్న మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వంయి

భువనేశ్వర్: ప్రభుత్వ ఆహార భద్రత కార్యక్రమం కింద ప్రతీ లబ్ధిదారుల కుటుంబానికి రూ.1,000 ఆర్థిక సాయంగా చెల్లించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి సోమవారం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 14 శాఖల 26 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. మంత్రివర్గ నిర్ణయాలను మంత్రులు రణేంద్ర ప్రతాప్ స్వంయి, అతున్ సబ్యసాచి నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా మీడియాకు వివరించారు. రూ.1000 ఏక విడత జీవనోపాధి సాయం అందించేందుకు నిర్ణయించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద ప్రతి లబ్ధిదారుని కుటుంబానికి 2 జ్యూట్ క్యారీ బ్యాగ్‌లను పంపిణీ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇది 95,90,526 పీడీఎస్ కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తుంది. ఈ నిర్ణయం మేరకు 1,91,81,052 జ్యూట్ క్యారీ బ్యాగ్‌ల పంపిణీ కోసం అవసరమైన నిధులు రూ.278.69 కోట్లు, ఒక్కో కుటుంబానికి రూ.1000 ఏక విడత జీవనోపాధి సహాయం కోసం రూ.959.05 కోట్లు, సమగ్రంగా మొత్తం రూ.1,237.74 కోట్ల రాష్ట్ర బడ్జెట్ నుంచి మంజూరు చేస్తారు.

యువతకు రుణ సౌకర్యం

యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు సరికొత్త పథకం స్వయంకి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద కొత్త వ్యాపారాన్ని ప్రారంభించాలనుకునే 18–35 సంవత్సరాల వయస్సు (ప్రత్యేక వర్గానికి 18–40 సంవత్సరాలు) మధ్య ఉన్న ఏదైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మద్దతు పథకాల నుండి గ్రామీణ నిరుద్యోగ యువతకు రుణ సదుపాయం కల్పిస్తారు. రుణ బకాయి లేని వారు, ప్రస్తుత వ్యాపార విస్తరణ ఆకాంక్షించే వారికి కొత్త పథకం కింద రూ.1 లక్ష వరకు వడ్డీ లేని బ్యాంకు రుణం అందించబడుతుంది. తొలి విడత కింద 1 లక్ష మంది గ్రామీణ యువకులను గుర్తించి స్వయం లబ్ధి కల్పిస్తారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.448 కోట్లు వెచ్చించేందుకు మంత్రి మండలి అంగీకరించింది. ఈ పథకం 2 సంవత్సరాల స్వల్ప కాలిక పథకంగా మంత్రి మండలి స్పష్టం చేసింది.

విద్యుత్ రంగం బలోపేతం

పునరుత్పాదక విద్యుత్ ఉత్పాదక కేంద్రాల నుంచి తరలింపును సులభతరం చేయడానికి ప్రసార మౌలిక సదుపాయాల కల్పనకు ఒడిశా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి విద్యుత్ అభివృద్ధి కార్యక్రమం కింద గ్రీన్ ఎనర్జీ ఎవాక్యుయేషన్ ట్రాన్స్‌మిషన్ కారిడార్ ద్వారా ఒడిషా పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓపీటీసీఎల్) ద్వారా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుంది. ఇది 2023–24 నుంచి 5 సంవత్సరాల్లో అమలు చేయబడుతుంది. రూ.1,345 కోట్ల పెట్టుబడి, రూ.641 కోట్ల ఈక్విటీ సపోర్టును ఒడిశా ప్రభుత్వం అందించనుంది. పవర్ ట్రాన్స్‌మిషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మరింత బలోపేతం చేసేందుకు కేబినేట్ 8 కొత్త అదనపు హైటెన్షన్ గ్రిడ్ సబ్ స్టేషన్ల ఏర్పాటు కోసం రూ.538.57 కోట్లు వెచ్చిస్తారు. అనుబంధ ప్రసార మార్గాలతో కూడిన సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని ఒడిషా పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓపీటీసీఎల్) 3 సంవత్సరాల వ్యవధిలో నిర్వహిస్తుంది. అదేవిధంగా రూ.656.73 కోట్ల వ్యయ ప్రణాళికతో ఏకామ్ర క్షేత్ర సౌకర్యాలు, స్మారక చిహ్నాల పునరుద్ధరణ కార్యాచరణ ప్రణాళిక (ఏకామ్ర) పథకం మంత్రివర్గం ఆమోదం పొందింది. ఈ పథకం 2024–25 ఆర్థిక సంవత్సరంలో అమలు చేయబడుతుంది. స్థానిక లింగరాజ్ ఆలయం, దాని చుట్టుపక్కల వారసత్వ ప్రాకారం అనుసంధాన కోసం ఈ పథకం పని చేస్తుంది.

బగ్గో పూజారికి నివాళులు

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ సమీపంలోని బొడ బరండి గ్రామంలో దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు బగ్గో పూజారి వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుమార్తె పరమ పూజారి మాట్లాడుతూ దేశానికి బగ్గో చేసిన సేవలు వివరించారు. అదేవిధంగా నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్‌చంద్ర మజ్జి బగ్గో పూజారి స్థూపం వద్ద నివాళులర్పించారు. మాజీ ఎంపీలు జయరాం పంగి, భగవాన్ మజ్జిలు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరంలో బగ్గో పూజారి చేసిన సేవలు ఈ ప్రాంతానికే ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఉమ్మర్ కోట్ ప్రాంతానికి చెందిన ప్రజలు పాల్గొన్నారు.



బగ్గో పూజారి స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ రమేష్ మజ్జి

300 కిలోల గంజాయి స్వాధీనం



పోలీసులు సీజ్ చేసిన గంజాయి, సీజ్ చేసిన కారులు

- ముగ్గురు నిందితులు అరెస్టు

భువనేశ్వర్: కటక్, భువనేశ్వర్ జంట నగరాల్లో మాదక ద్రవ్యాల వ్యాపారం నివారణ కార్యాచరణలో భాగంగా జంట నగరాల కమిషనరేట్ పోలీసు స్పెషల్ క్రైమ్ విభాగం గంజాయి అక్రమార్కుల గుట్టురట్టు చేసింది. ఈ వ్యవహారంలో అంతర్ రాష్ట్ర రవాణా చేస్తున్న 3 మంది నిందితులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.30 లక్షల విలువైన 300 కిలోల గంజాయి స్వాధీనపరచుకున్నారు. గంజాయి అక్రమ రవాణాలో ఉపయోగించిన 2 కారులు, రూ.14,000 నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాకు వీలుగా కారుల్లో ప్రత్యేక రహస్య చాంబర్లతో పునర్నిర్మించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారం వెనక ప్రధాన సూత్రధారి కోసం దర్యాప్తు బృందం గాలిస్తుంది. ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ నుంచి జార్ఖండ్‌కు గంజాయి రవాణా చేస్తున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు స్పెషల్ క్రైమ్ యూనిట్ మాదక ద్రవ్యాల శాఖ అదనపు డిప్యూటీ కమిషనర్ సంజీవ్ శత్పతి నేతృత్వంలో ప్రత్యేక బృందం 16వ నంబర్ జాతీయ రహదారి పిత్తాపల్లి ప్రాంతంలో నిఘా వేశారు. దీనిలో భాగంగా రెండు కారులను వెంబడించి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో జార్ఖండ్ ప్రాంతీయులు రాజేష్ దాస్ (34), రవిశంకర్ దాస్ (41), లా కిషోర్ ప్రసాద్ సహదేవ్ ఉన్నట్లు పేర్కొన్నారు. ముగ్గురు నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయ స్థానం జైలు కస్టడీకి రిమాండ్ చేసింది. ఈ కేసులో సాక్ష్యాధారాల సేకరణ నిమిత్తం నిందితులకు మూడు రోజుల పోలీసు రిమాండ్‌కు అనుమతించాలని దర్యాప్తు న్యాయ స్థానానికి అభ్యర్థించింది.

2,144 టిడ్కో ఇళ్ల పంపిణీకి చర్యలు



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

- 17న ఉమ్మడి విజయనగరం జిల్లాలో పంపిణీ
- సాలూరులో 1056 గృహాలు, విజయనగరం సారిపల్లిలో 1088 గృహాలు

పార్వతీపురం టౌన్: ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఈ నెల 17 నాటికి లబ్ధిదారులకు అప్పగించేందుకు 2144 టిడ్కో గృహాలను సిద్ధం చేస్తున్నట్టు ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. పార్వతీపురం పట్టణంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్లను ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షా 50 వేలు టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించాలన్నది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం కాగా, ఇప్పటికే 95వేలు గృహాలను అప్పగించారన్నారు. సాలూరు మున్సిపాల్టీ పరిధిలో గుమడాం వద్ద 1056 గృహాలు, విజయనగరం మున్సిపాల్టీ పరిధిలోని సారిపల్లి వద్ద 1088 గృహాలను లబ్ధిదారులకు కొద్దిరోజుల్లో అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో టిడ్కో ఎస్ఈ డి.నర్సింహమూర్తి, ఈఈ జ్యోతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మాసిస్టు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట (విశాఖపట్నం): ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఫార్మాసిస్టుల గ్రేడ్–2 నియామకాలకు ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ బి.సుజాత (విశాఖ,జోన్) నోటిఫికేషన్ జారీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారా మరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ఖాళీగా ఉన్న 8 ఫార్మాసిస్టు గ్రేడ్–2 పోస్టులు భర్తీ చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ నెల 27వ తేదీన దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను రేసవానిపాలెంలోని ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు వారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇంటర్మీడియట్ అర్హతతోపాటు డి.ఫార్మా/ బి.ఫార్మా ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. వివరాల కోసం https@// nagendrasvast.wordpress.com వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. ఓసీ అభ్యర్థులు రూ. 500, మిగిలిన కులాలకు చెందిన అభ్యర్థులు రూ.300, డిమాండ్ డ్రాఫ్ట్ తీసి దరఖాస్తుకు జత చేయాలన్నారు. రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ, విశాఖపట్నం పేరిట డీడీ తీయాలని డాక్టర్ సుజాత తెలియజేశారు.

జాబ్‌మేళా రేపు

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలోని ప్రభు త్వ జూనియర్ కళాశాలలో ఈనెల 14న ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధి అధికారి ఆర్.వహీదా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువ కులకు ఉపాధి కల్పించేందుకు హైదరాబాద్‌కు చెందిన శ్రీకృష్ణా ఫార్మసీ ముందుకు వచ్చిందని, వంద ట్రైనీ ఖాళీల భర్తీ చేయనుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జాబ్ సీకర్ లాగిన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి తొలుత వేతనం నెలకు రూ.15 వేలు చెల్లిస్తారని, 2019 నుంచి 2023 మధ్య బీఎస్సీ కెమిస్ట్రీ ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు గల ఒరిజినల్స్, జెరాక్స్ కాపీ, ఫొటోలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆమె కోరారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

సాలూరు: పాచిపెంట మండలంలోని గడివలస గ్రామానికి చెందిన కోరాడ జోగేశ్వరరావు(47) హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి పట్టణంలోని రూరల్ సీఐ స్టేషన్‌లో నిందితులను విలేకరులకు చూపించారు.ఈ సందర్భంగా పాచిపెంట ఎస్సై నారాయణరావుతో కలిసి సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన గడివలస గ్రామ సమీప పొలంలో జోగేశ్వరరావును హత్య చేశారని మృతుని భార్య గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేపట్టామన్నారు. ఫిర్యాదు మేరకు నిందితులు అదే గ్రామానికి చెందిన కోరాడ నర్సింహులు(50), కోరాడ అప్పారావు(59), కోరాడ ఉమా మహేశ్వరరావు (31)లను సోమవారం మంచాడవలస సమీపంలో పట్టుకున్నామని తెలిపారు. కాగా వరుసకు చిన్నాన్న పెదనాన్న పిల్లలైన వారికి భూ గట్టు విషయంలో కొంతకాలంగా తగాదా ఉందన్నారు.ఈ క్రమంలోనే ఈ నెల 10న పొలం వద్ద జోగేశ్వరరావును నర్సింహులు కొడవలితో పీక కోసివేయగా, కాళ్లు చేతులను కోరాడ అప్పారావు, కోరాడ ఉమామహేశ్వరరావులు పట్టుకుని హత్యకు సహకరించారని చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని, కేసు దర్యాప్తు కొనసాగుతుందని సీఐ వివరించారు.

ప్రకృతి సాగుపై అధ్యయనం



కుమ్మపల్లిలో ప్రకృతి, సేంద్రియ సాగు పద్ధతులను అమెరికా బృందం సభ్యులకు వివరిస్తున్న వైస్ చాన్సలర్ విజయకుమార్

వేపాడ: ప్రకృతి సాగు పద్ధతులపై అమెరికా, కర్ణాటక బృందాలు అధ్యయనం చేశాయి. వేపాడ మండలం కుమ్మపల్లి క్లస్టర్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేస్తున్న పంటలను సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించాయి. వావెర్లీ స్ట్రీట్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ జారెడ్ బ్లూమెన్‌ఫీల్డ్, సీనియర్ లీడర్ జగదాశివన్, కాలిఫోర్నియా బృందం సభ్యులు ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలు, నవధాన్యాల సాగు, సేంద్రియ కషాయాల తయారీ పద్ధతులను స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. డెక్క ఈశ్వరరావు మామిడి తోటలో సాగుచేస్తున్న అంతర పంటలు, 20 సెంట్లల్లో నిరంతరం పండించే పంటలు (ఏటీఎమ్ మోడల్ పద్ధతి), దిగుబడి, రాబడి వివరాలను రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చాన్సలర్ విజయకుమార్ తెలియజేశారు. ఫుడ్‌బాస్కెట్ అమలు తీరును వివరించారు. అనంతరం డీపీఎం ఆనంద్ అధ్యక్షతన కుమ్మపల్లిలో నిర్వహించిన సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి రామారావు, రీజనల్ కోఆర్డినేటర్ కృష్ణారావు, ఆర్‌టీఎల్ ప్రకాష్, ఆర్‌టీఓ హేమసుందర్‌లు ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. మహిళా సంఘాలకు రుణాల మంజూరు, చెల్లింపులు, రుణాల సద్వినియోగం, సంఘాల పనితీరును ఏపీఎం శ్రీనివాసరావు తెలియజేశారు. కార్యక్రమంలో కొత్తవలస, వేపాడ ఏఓలో ఎ.ఎల్.విజయ, యశ్వంతరావు, ఎస్ఆర్‌పీ రాజ్యలక్ష్మి, సర్పంచ్ నాడు అరుణ, డీపీఎంయూ, ఎస్ఎఫ్ఏఎస్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

- ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు



పదోతరగతి పరీక్షలపై సమీక్షిస్తున్న ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు

పార్వతీపురం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు కావలసిన ఏర్పాట్లు పూర్తి చేయాలని, అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలు పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖలు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. విద్యార్థుల కోసం బస్సుసౌకర్యం లేని గ్రామాల నుంచి ప్రత్యేక సర్వీసులు నడపాలని ప్రజా రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. రైల్వే గేట్లు ఉన్న గ్రామాల నుంచి విద్యార్థులు ముందుగా బయలుదేరేలా చూడాలన్నారు. పరీక్ష సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లో మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన భద్రత చర్యలపై పోలీస్ శాఖకు సూచనలు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పరీక్షల ఏర్పాట్లను వివరించారు. జిల్లాలోని 217 పాఠశాలలకు చెందిన 11,198 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరుకానున్నారని, వీరిలో 10,534 మంది విద్యార్థులు రెగ్యులర్, 664 మంది ప్రైవేటు అభ్యర్థులుగా పేర్కొన్నారు. జిల్లాలో 66 పరీక్ష కేంద్రాలు, 600 మంది ఇన్విజిలేటర్లు, మూడు ఫ్లయింగ్ స్కాడ్‌లను నియమిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.ఇ.రేణుజ్యోతి, జిల్లా ప్రజారవాణా అధికారి టి.వి.ఎస్.సుధాకర్, ఆర్టీఓ సి.మల్లిఖార్జునరెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మత్తు వదిలిస్తాం..

- గంజాయి తదితర మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం
- పోలీస్‌స్టేషన్ స్థాయిలోనే ఫిర్యాదుల పరిష్కారానికి కృషి
- అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటా..
- విశాఖ రేంజ్ నూతన డీఐజీ విశాల్ గున్ని



విశాఖ రేంజ్ డిఐజీగా బాధ్యతలు చేపట్టిన విశాల్ గున్నీకి మొక్కను అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

సాక్షి, విశాఖపట్నం/విజయనగరం టౌన్: నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్డీపీఎస్)పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, దానికి అనుగుణంగానే తమ పనితీరు ఉంటుందని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని చెప్పారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగాన్ని, అక్రమ రవాణాను నిర్మూలిస్తామని, ఏజెన్సీ ప్రాంత జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను రేంజ్ పరిధిలోని 5 జిల్లాల ఎస్పీలు, పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డీఐజీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రేంజ్ పరిధిలోని గల వివిధ జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి తమ శాఖలోని అన్ని విభాగాలను పటిష్టపరిచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ స్థాయిలోనే ఫిర్యాదు ఇచ్చిన వారందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన ప్రథమ కర్తవ్యమన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనలకు లోబడి పనిచేస్తూ ముందుకు వెళతామన్నారు. తాను అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని, వార్తలు ప్రచురించే ముందు తనను లేదా ఎస్పీ స్థాయి అధికారులను సంప్రదించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లాలని మీడియా ప్రతినిధులను కోరారు. సోషల్ మీడియాలో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ అవాస్తవాలను వార్తలుగా ప్రచురించడం రోజురోజుకు పెరుగుతోందని, ఈ కారణంగా ప్రజలు అయోమయానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వార్త ప్రచురించే ముందు నిజనిర్ధారణ చేసుకోవాలని సూచించారు.

తొలి పోస్టింగ్ నర్సీపట్నం ఏఎస్పీగా..

2010 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన విశాల్ గున్ని శిక్షణానంతరం నర్సీపట్నం సబ్ డివిజన్ ఏఎస్పీగా పనిచేశారు. 2013 నుంచి 2015 వరకు నర్సీపట్నం ఏఎస్పీగా చేసిన ఆయన పదోన్నతిపై ఓఎస్డీగా నియమితులయ్యారు. అనంతరం నెల్లూరు,, తూర్పుగోదావరి జిల్లాల ఎస్పీగా, గ్రేహౌండ్స్ ఎస్పీగా, విజయవాడ డీసీపీ (లా అండ్ ఆర్డర్)గా పనిచేశారు. విజయవాడ నుంచి పదోన్నతిపై విశాఖ రేంజ్ డీఐజీగా వచ్చారు. విజయనగరం జిల్లా ఎస్పీ ఎం.దీపిక విశాల్ గున్నీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించకుంటే ప్రత్యక్ష ఆందోళనలు

శ్రీకాకుళం, శ్రీకాకుళం అర్బన్: ఉద్యోగ సంఘాల సమస్యలు పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమని ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం అన్నారు. సోమవారం జిల్లా ఎన్‌జీవో హోమ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు ఎంతగానో సహకరిస్తున్నామని, న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ నాయకులు బడగల పూర్ణచంద్రరావు, రాయి వేణుగోపాల్, పూజారి జానకిరామ్, కె.రోజా, రాణి, బొత్స శ్రీనివాసరావు, అట్ల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు సోషల్ ఇంజినీర్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులు సోషల్ ఇంజినీర్లని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. ఆయన సోమవారం స్థానిక ఎంపీఆర్ లా కాలేజీ విద్యార్థులకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయం న్యాయ సేవా సదన్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాదిగా కొనసాగాలంటే ప్రతి నిత్యం విద్యార్థిగానే ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో న్యాయ విద్యార్థులు ఎం పి ఆర్ లా కాలేజ్ కళాశాల ప్రిన్సిపల్ కే మోషే పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎస్‌బీ, దిశా డీఎస్పీలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖకు సంబంధించి స్పెషల్ బ్రాంచి, దిశా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీలు ఎ.త్రినాథరావు, ఆర్.శ్రీనివాసరావులు సోమవారం వారి వారి కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టారు. డీఎస్పీ త్రినాథరావు 1989వ బ్యాచ్‌కు చెందినవారు. ఎస్‌ఐగా పశ్చిమగోదావరి జిల్లా అత్తిలిలో మొదటి పోస్టింగ్‌లో చేరారు. అనంతరం 2004లో సీఐగా తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో, 2014లో రాజమండ్రి క్రైమ్ డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. చివరిసారిగా విశాఖపట్నం టాస్క్‌ఫోర్సులో నాలుగున్నరేళ్లు చేసి ఇక్కడికి డీఎస్పీ బాలరాజు స్థానంలో బదిలీపై వచ్చారు. ఈయన స్వగ్రామం మచిలీపట్నం. అలాగే ఎస్.వాసుదేవ్ స్థానంలో జిల్లా దిశా డీఎస్పీగా వచ్చిన ఆర్.శ్రీనివాసరావు 1991 బ్యాచ్‌కు చెందినవారు. ఎస్‌ఐగా ప్రకాశం జిల్లాలో తొలిసారిగా చేశారు. 2014లో తాడివాడిపల్లెలో సీఐగా, 2014లో ఎస్‌బీ డీఎస్పీగా ప్రకాశం జిల్లాలో ఉద్యోగోన్నతులు పొందారు. అనంతరం విజయవాడ ఎయిర్‌పోర్టు, ఇంటెలిజెన్సు, సీఐడీ డీఎస్పీలుగా చేసి చివరిసారిగా ఎస్సీ,ఎస్టీ సెల్ విజయనగరం డీఎస్పీ అటాచ్డ్ దిశా చేసి బదిలీపై శ్రీకాకుళం వచ్చారు. ఈయన స్వస్థలం గుంటూరు జిల్లా ఉంగుటూరు.

అప్రెంటిస్‌కు 47 మంది ఎంపిక



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో సోమవారం ఐటీఐ, ఇంటర్మీడియెట్ ఒకేషనల్ పూర్తి చేసిన వారికి అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో జిల్లాలోని ఎనిమిది కంపెనీలు పాల్గొన్నాయి. మొత్తం 82 మంది హాజరు కాగా, వీరిలో నైపుణ్యం ఆధారంగా 47 మందిని ఎంపిక చేశారు. అనంతరం వీరికి నియామక పత్రాలు అందజేశారు. మేళాను ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఐటీఐ పూర్తిచేసిన ప్రతి విద్యార్థి అప్రెంటిస్‌షిప్ చేయాలని సూచించారు.

విధుల్లో చేరిన క్రైమ్ అదనపు ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్)గా బి.ఉమామహేశ్వరరావు జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబరులో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 1989కు బ్యాచ్‌కు చెందిన వారు. ఎస్‌ఐగా తెలంగాణలో బాధ్యతలు చేపట్టిన ఈయన మండపేట, కై కలూరుల్లో సీఐగా చేశారు. అనంతరం విజిలెన్సు డీఎస్పీగా కృష్ణా జిల్లా నందిగామ, ఒంగోలులో, ఏసీబీ డీఎస్పీగా విజయవాడ చేస్తూ అటాచ్డ్‌గా ఎస్సీ, ఎస్టీ సెల్ ఏలూరు డీఎస్పీగా ఐదేళ్లకు పైగా కృష్ణా, ఏలూరు జిల్లాల్లో పనిచేశారు. బదిలీపై ఉద్యోగోన్నతిలో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఈయన స్వగ్రామం ఏలూరు.

రాత్రి పదిన్నర దాటాక అన్నీ బంద్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో రాత్రి పదిన్నర సమయం దాటితే అన్నీ ఇక బంద్ చేయాలంటూ రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా నగరంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ ఆదేశాలతో ఈ నిర్ణయం అమలు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. దీనిలో భాగంగా సోమవారం రాత్రి పదిగంటల సమయంలో దుకాణాలను బంద్ చేయాలంటూ యజమానులకు చెప్పామన్నారు. అంతేకాక బార్‌అండ్ రెస్టారెంట్లు వారు 11 గంటలకల్లా మూసివేయాలని, మందుబాబుల ఆగడాలు ఆ సమయం దాటి కనిపిస్తే సహించేది లేదన్నారు. ఈ క్రమంలో నగరంలోని చినబొందిలీపురంలో యువకులు మద్యం సేవించి తిరుగుతుండగా హద్దు మీరి ప్రవర్తించరాదని హెచ్చరించారు. నగరంలో సరైన కారణం లేకుండా అర్ధరాత్రి 12 దాటి తిరిగినా, అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కేసులు బుక్ చేస్తామన్నారు.

రథసప్తమి వేడుక

వైభవంగా నిర్వహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్

- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహిద్దామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 16న జరగనున్న రథసప్తమి వేడుకల ఏర్పాట్లలో భాగంగా ఆయన సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్యూలు, ప్రసాదాల పంపిణీ తదితర చర్యలు చేపట్టాలని, పాలు, బిస్కెట్లు, మంచినీరు అందించే ప్రక్రియ సజావుగా జరపాలని చెప్పారు. వైద్య శిబిరాల ఏర్పాటు, ఉచిత భోజనం వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి 15వ తేదీ అర్ధరాత్రి నుండి పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని, ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని పేర్కొన్నారు. రథసప్తమి దృష్ట్యా దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నిరంతరం విద్యుత్ అందేలా చర్యలు చేపట్టాలని అలాగే ముందస్తు జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, భక్తులకు నిరంతరం అందుబాటులో తాగునీరు అందించే చర్యలు చేపట్టాలని, వికలాంగులు, వృద్ధుల కోసం వీల్ ఛైర్స్ ఏర్పాటుచేసి అవి ఎక్కడ అందుబాటులో ఉన్నాయో తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం సీసీ కెమెరాలు పని చేసేలా చూడాలని, కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రెవెన్యూ, దేవాదాయశాఖకు సంబంధించిన సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. 80 ఫీట్ రోడ్డులో భక్తుల వాహనాల పార్కింగ్‌కి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చూడాలని, పుష్కరిణి పరిసరాల్లో లైటింగ్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

సమావేశంలో ఎస్పీ జీఆర్ రాధిక, కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియా, జిల్లా అటవీ శాఖాధికారిణి నిషాకుమారి, డీఆర్‌ఓ గణపతి రావు, ఆర్‌డీఓ సీహెచ్ రంగయ్య, ఎండోమెంట్ ఆర్‌జేసీ విజయకుమార్, సహాయ కమిషనర్ డీవీవీ ప్రసాద్ పట్నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.మీనాక్షి, ట్రాఫిక్ సీఐ అవతారం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగి వర్మ, ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: రక్తదానం ప్రాణదానమని శ్రీకాకుళం ఆర్టీసీ రెండో డిపో మేనేజర్ కేఆర్‌ఎస్ శర్మ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా శ్రీకాకుళం ఆర్టీసీ డిస్పెన్సరీ వద్ద ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో శర్మ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాలు కాపాడేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం రక్త దాతలకు సర్టిఫికెట్స్ అందజేశారు. రక్తదాన కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, శ్రీకాకుళం 1, 2వ డిపోల అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, శ్రీకాకుళం 2వ డిపో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) బి. చాణక్య, శ్రీకాకుళం 1, 2వ డిపోల ఆయిల్ ఈఐ లు శ్రీను, రమేష్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్. సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలలకు చేయూత



నగదును అందిస్తున్న దాతలు

పొందూరు: తల్లిదండ్రులను కోల్పోయిన బాలలకు దాతలు చేయూత అందిస్తున్నారు. 'సాక్షి'లో ఈ నెల 5న ప్రచురించిన 'తల్లిదండ్రులు దూరం భవిత భారం' కథనానికి స్పందించిన దాతలు బాలలకు సాయం అందజేస్తున్నారు. శ్రీకాకుళంలోని శాంతినికేతన్‌లో ఇంటర్ 1995–97 బ్యాచ్ సుమారు రూ. 25, 501, రాజాం పట్టుశాలీ సంక్షేమ సంఘం రూ. 10 వేలు, చదువుల ప్రసాద్ రూ. 2 వేలు, దున్న గగన్ రూ. 2వేలు, అల్లంశెట్టి సర్వోత్తమరావు రూ. 2 వేలు, చదువుల ప్రసాద్ రూ. 2వేలు, కోరుకొండ సునీల్ రూ. 2వేలు, గుంటుకు కృష్ణారావు రూ. 2వేలు తదితరులు సాయం అందజేశారు. సాయం అందజేసేందుకు 9912474529 నంబర్‌ను సంప్రదించాలని బాలలు కోరుతున్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

- కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి



చిరుధాన్యాల ప్రదర్శన పరిశీలిస్తున్న వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి

విజయనగరం అర్బన్: చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలు తినేవారికి ఆరోగ్యం సిద్ధిస్తుందని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో 'చిరుధాన్యాల సాగు, వాటి వినియోగంపై ఎంట్రప్రెన్యూర్స్‌కు మరియు వినియోగదారులకు అవగాహన' అనే అంశంపై సోమవారం జరిగిన ఒక్కరోజు సదస్సులో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాలను ఆహారపు అలవాట్లలో భాగం చేసుకోవాలన్నారు. డివిజనల్ ఫారెస్ట్ అధికారి కె.జానకీరావు మాట్లాడుతూ చిరుధాన్యాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. మల్లువలసలోని ఆరోగ్య మిల్లెట్ సీఈఓ సరస్వతి మాట్లాడుతూ చిరుధాన్యాలతో వివిధ రకాల ఆహారపదార్థాలు తయారు చేసుకోవచ్చన్నారు. అనంతరం చిరుధాన్యాల వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫర్ మిల్లెట్ సిస్టర్స్ ఎఫ్‌పీఓ సెక్రటరీ కె.జోగినాయుడు, ఆరోగ్యం సంస్థ వ్యవస్థాపకుడు డి.వి.కృష్ణారెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్, అన్ని విభాగాల డీన్స్, టీచింగ్, నాన్ టీచింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి పనులపై కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల అమలులో ఎలాంటి అలసత్వం చూపరాదని కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ అన్నారు. జిల్లా అధికారులతో కలిసి సోమవారం మధ్యాహ్నం ఆయన సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ, నవరత్నాలు పేదల ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు, అసైన్డ్ భూములు, కోర్టు కేసులు తదితర అంశాలపై తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డులు, ఆయుష్మాన్ కార్డుల పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలని, జిల్లా వ్యాప్తంగా 1.84 లక్షల కార్డుల పంపిణీ మాత్రమే జరిగిందని, ఇంకా మిగిలిన కార్డులు పంపిణీ చేయాల్సి ఉందని ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి త్వరితగతిన పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు రిజిస్ట్రేషన్లు జిల్లాలో ఇప్పటి వరకూ 22,081 మాత్రమే జరిగాయని ఇంకా మిగిలిన వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు. సర్వర్ ఎర్రర్, మిస్ మ్యాచ్ లాంటి సాంకేతిక సమస్యలకు జిల్లా రిజిస్ట్రార్‌తో సమన్వయం చేసుకుని లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కుల్ని కల్పించడంలో భాగంగా 2003 జూలై 31కు ముందు కేటాయించిన భూములపై సర్వేను పూర్తి చేయాలని చెప్పారు. భూముల రికార్డులను క్రమబద్ధీకరించడంలో భాగంగా తహసీల్దార్లు ఇప్పటికే ఇంటి స్థలాలు, వ్యవసాయ సాగు కోసం ప్రభుత్వం కేటాయించిన భూములను సర్వే నంబర్ల వారీగా సర్వే చేశారని, ఇంకా పూర్తి చేయని తహసీల్దార్లు దీన్ని ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని అన్నారు.

అభివృద్ధికి అద్దం



దశాబ్దాలుగా టీడీపీ నాయకులకు పట్టం కట్టినా విజయనగరం జిల్లా కేంద్రం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా ఉండేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక చారిత్రక నేపథ్యం ఉన్న విజయనగరం ప్రగతిపట్టాలెక్కింది. విద్యాలయాల రాకతోపాటు ప్రధాన కూడళ్లన్నీ అందంగా ముస్తాబయ్యాయి. పార్కులు, నగరంలోని చెరువు గట్లు పర్యాటక ప్రాంతాలుగా విరాజిల్లుతున్నాయి. విజయనగరంలోని 50 డివిజన్లలో ఏ డివిజన్‌ను చూసినా అభివృద్ధి కళ్లకుకడుతుంది. సంక్షేమ పథకాల లబ్ధి డాష్ బోర్డుల రూపంలో సాక్షాత్కరిస్తుంది. పట్టణానికి వచ్చేవారికి 'ఇది మన విజయనగరం' అని గట్టిగా నినదించేలా ప్రగతి కనిపిస్తుంది. దీనికి మచ్చుకు 14వ డివిజన్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిని ఓసారి తరచిచూద్దాం.

- విజయనగరం నగరపాలక సంస్థ ప్రగతిపథం
- గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అనేక మౌలిక వసతులు
- ఆదర్శప్రాయంగా 14వ డివిజన్
- సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పథకాలన్నీ సద్వినియోగం
- ఆనందంలో డివిజన్ ప్రజలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఓ వైపు ధనికులు, మరోవైపు పేదలు నివసించే విజయనగరంలోని 14వ డివిజన్‌ను గత టీడీపీ పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఇదిగో తాము ఈ అభివృద్ధి చేశామని చూపించుకోవడానికి ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా చేయలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక డివిజన్ రూపురేఖలే మారిపోయాయి. అక్కడ నివసిస్తున్న 1,150 కుటుంబాల్లోని అర్హుల ఇళ్లకు సంక్షేమ పథకాలు చేరువయ్యాయి. 5,648 మంది జనాభా అవసరాల మేరకు మౌలిక వసతులు సమకూరాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఇచ్చిన సహకారంతో విద్య, వైద్యం సహా అన్ని సదుపాయాలు చేరువయ్యాయి. ప్రభుత్వ తోడ్పాటుకు తోడు నగరపాలక సంస్థ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు (రాజేష్) ప్రత్యేక కృషితో డివిజన్ ఓ రోల్‌మోడల్‌గా మారింది.



ఇదే మా అందమైన బడి



చిత్రంలో కనిపిస్తున్నది 14వ డివిజన్‌లోని కొత్తపేట కుమ్మరివీధిలో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాల. నాడు కనీస సదుపాయాలకు నోచుకోని పాఠశాల నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.23 లక్షలతో అన్ని సౌకర్యాలున్న పాఠశాలుగా అభివృద్ధి చేసింది. స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మరో రెండు అదనపు గదుల నిర్మాణానికి కార్పొరేషన్ నుంచి నిధులు కేటాయించారు. కార్పొరేటర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు సొంతగా ఆరు తరగతి గదులకు ఏసీ సౌకర్యం కల్పించారు. ఆర్వో ప్లాంట్‌తో రక్షిత తాగునీటి సదుపాయం కల్పించారు. దృఢ సంకల్పంతో పనిచేసే 9 మంది ఉపాధ్యాయులు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియంలో బోధనతో కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా తయారైంది. ఒకప్పుడు ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ ఐదుగురు ఉపాధ్యాయులు, 70 మంది విద్యార్థులతో ఉండే ఈ పాఠశాలలో ఇప్పుడు 240 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. టైల్స్‌తో ఫ్లోరింగ్, తరగతి గదుల్లో ఏసీ సౌకర్యంతో పాటు అదనపు గదులు నిర్మించడంతో ప్రాథమిక పాఠశాల ఇప్పుడు ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్‌అయ్యింది. పేదకుటుంబాల పిల్లల బంగారు భవిష్యత్తుకు బాసటగా నిలుస్తోంది.

నిత్యసేవలో వార్డు సచివాలయం

ఒక విజన్‌తో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థలో భాగంగా ఇక్కడ 17వ నంబర్ వార్డు సచివాలయాన్ని ఏర్పాటుచేశారు. తొమ్మిది మంది కార్యదర్శులు తమ విభాగ సేవలను ప్రజలకు అందించడంలో ముందుంటున్నారు. ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు, వారి సమస్యలను అధికారుల వద్దకు చేర్చడంలో 22 మంది వలంటీర్లు ఉత్తమమైన సేవలు అందిస్తున్నారు. సచివాలయంలో సేవలు, కార్యదర్శుల ఫోన్ నంబర్లతో బోర్డులు, పథకాల సమాచార ప్రసారానికి ఫ్లోర్‌లీడర్ ప్రత్యేక టీవీ ఏర్పాటు చేయించారు.



14వ వార్డులోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న స్థానిక యువకులు

14వ డివిజన్ స్వరూపం ఇలా....

జనాభా	: 5,648
ఓటర్లు	: 3,750
వీధులు	: 9 (కొత్తపేట కూరెళ్లవారి వీధి, పులిగెడ్డవారి వీధి, పద్మశాలి వీధి, కుమ్మరివీధి, గొల్లవీధి, గాడ వీధి, సుద్దవీధి, గ్రంధి కిత్తయ్య కొనేరు గట్టు)

ప్రభుత్వ భవనాలు...

- 17వ వార్డు సచివాలయం
- కేపీ గొల్ల మున్సిపల్ ప్రాథమిక పాఠశాల
- వైఎస్సార్ అర్బన్ క్లినిక్
- కుక్కల బంగ్లా
- 2 మున్సిపల్ పార్కులు
- గ్రంధి కిత్తయ్య కోనేరు
- 3 పబ్లిక్ టాయిలెట్లు
- 2 అంగన్‌వాడీ సెంటర్లు
- 2 రేషన్ డిపోలు

మౌలిక సదుపాయాలు

బోర్లు	: 39
పబ్లిక్ కొళాయిలు	: 21
వ్యక్తిగత కొళాయిలు	: 252
విద్యుత్ స్తంభాలు	: 170
సీసీ రోడ్లు	: 2.75 కిలోమీటర్లు
బీటీ రోడ్లు	: 0.95 కిలోమీటర్లు
డ్రెయిన్లు	: 2100 మీటర్లు
కల్వర్టులు	: 12
వీధుల్లో విద్యుత్‌దీపాలు	: 210
హైమాక్స్ విద్యుత్తు స్తంభాలు	: 3
మున్సిపల్ ఉపాధ్యాయులు	: 8
వార్డు సచివాలయం సిబ్బంది	: 9
వలంటీర్లు	: 22
అంగన్‌వాడీ టీచర్లు	: 2
అంగన్‌వాడీ ఆయాలు	: 2
శానిటేషన్ వర్కర్లు	: 10
శానిటేషన్ చార్జెంట్	: 1
ఆశ వర్కర్లు	: 1



ప్రజారోగ్యానికి భరోసా కల్పించేలా..

ఒకప్పుడు ఏ చిన్న అనారోగ్యం వచ్చినా రెండు కిలోమీటర్ల దూరంలోని లంకా పట్నం బంగారమ్మపేట లోనున్న పీహెచ్‌సీకి 14వ డివిజన్ ప్రజలు వెళ్లాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయంతో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (ఆస్పత్రి) అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ కూడా మందులు ఉంచడానికి అదనంగా ర్యాక్‌లు, తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్‌ను కార్పొరేటర్ సొంత డబ్బుతో ఏర్పాటు చేయించారు. డాక్టర్ గదిలో ఏసీ సౌకర్యం కల్పించారు. అత్యవసర పరిస్థితిలో ఉన్నవారికి తక్షణమే ప్రాథమిక వైద్యచికిత్స అందించడానికి వీలుగా ఒక గదిని ఐసీయూ తరహాలో అభివృద్ధి చేశారు. ప్రతిరోజూ 70 నుంచి 80 మంది వరకూ ఇక్కడ వైద్యసేవలు పొందుతున్నారు.

ఆదర్శవంతంగా...



ఒకప్పుడు మురికివాడగా నున్న కుమ్మరివీధి కొత్తపేట ప్రాంతాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి కృషితో ఆదర్శవంతంగా మారింది. నాలుగుసార్లు కార్పొరేటర్‌గా ఎన్నుకున్న ప్రజలకు సేవ లందిస్తున్నా. ఓ వైపు సంక్షేమ పథకాలు, యువతకు ఉపాధికల్పనతో పాటు వార్డులో సౌకర్యాల కల్పనకు తనవంతు కృషి చేస్తున్నా. గత టీడీపీ పాలనలో విజయనగరానికి ఒరిగిందేమీ లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే అభివృద్ధి పనులు చేయగలిగాం.

– శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు (రాజేష్), ఫ్లోర్‌లీడర్, విజయనగరం నగరపాలక సంస్థ



వార్డు సచివాలయంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న లబ్ధిదారులు



కుమ్మరి వృత్తివారికి సౌకర్యంగా ఏర్పాటుచేసిన ఆవుశాలలు